క్లుప్తంగా

ఘనంగా జములమ్మ ఉత్సవాలు



అమరచింత: మండల కేంద్రంలో మంగళవారం జములేశ్వరి అమ్మవారి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భక్తులు భారీగా పాల్గొని అమ్మవారికి మొక్కులు చెల్లించారు. కొత్తగా అమ్మవారి పాదాలు కట్టుకొనే వారితో పాటు ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన భక్తులు అమ్మవారికి పొటేళ్లను బలిచ్చారు. అమ్మవారి ఆలయంలో శివసత్తులు నాట్యం చేశారు. ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ కమిటీ అధ్యక్షుడు మంగలి నరసింహులు సౌకర్యాలను కల్పించారు.

ఈదమ్మ బోనాల వేడుక



గోపాల్‌పేట: మండల కేంద్రంలోని ఈదమ్మ గడ్డలో మంగళవారం ఈదమ్మ బోనాల పండుగ ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు ఇంటి వద్ద వండిన ప్రత్యేక వంటకాన్ని ఈదమ్మ గుడి దగ్గరకు తీసుకొచ్చి గుడి చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. బోనాల పండుగ సందర్భంగా నిర్వాహకులు కబడ్డీ పోటీలు నిర్వహించారు.

మిషన్ భగీరథ పనుల పరిశీలన



వనపర్తి క్రైం: జిల్లా కేంద్రంలోని 30వ వార్డులో ఉన్నటువంటి మిషన్ భగీరథ పనులను మంగళవారం స్థానిక కౌన్సిలర్, మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటీశ్రీధర్ పరిశీలించారు. వనపర్తి నియోజకవర్గంలో తాగునీటి సమస్య లేకుండా దీర్ఘకాలిక ప్రణాళికతో ఆలోచించి రూ.330 కోట్లతో అత్యాధునిక సౌకర్యాలతో మిషన్ భగీరథ ద్వారా తాగునీరు అందిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా వనపర్తి పట్టణంలో 82 కి.మీ పైప్‌లైన్లను ఐదు ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకుల పనులు పూర్తి కావచ్చాయని, పూర్తయిన పైప్‌లైన్లకు లింకులు కలిపే పని ప్రస్తుతం జరుగుతుందని అన్నారు. అందుకు కృషి చేసిన మంత్రి నిరంజన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



ఆత్మకూర్: మండలంలోని జూరాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులు ఘనంగా స్వయంపరిపాలన దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈసందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలను బోధించారు. డీఈఓగా శివ, ఎంఈఓగా అరవింద్, హెచ్‌ఎంగా మధు తోపాటు 20మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా బాధ్యతలను నిర్వర్తించారు. కార్యక్రమంలో పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ మద్దిలేటి, హెచ్‌ఎం రాఘవేందర్, ఉపాధ్యాయులు సంతోష్‌కుమార్, షకీల్‌అహ్మద్, నాగప్రియ, భానుప్రియ, జయశ్రీ, నరేష్, విద్యార్థులున్నారు.

గిరిజన మహాసభల కరపత్రాల విడుదల

పాన్‌గల్: తెలంగాణ గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఈనెల 12న మండలంలోని తెల్లరాళ్లపల్లిలోని లిటిల్‌స్టార్ ఉన్నత పాఠశాలలో నిర్వహించే జిల్లా 2వ మహాసభలకు గిరిజనులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు బాల్యానాయక్ కోరారు. మంగళవారం మండలంలోని తెల్లరాళ్లపల్లితండాలో మంగళవారం జిల్లా మహాసభల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యల సాధనే లక్ష్యంగా ఈ మహాసభలను నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ మహాసభలకు సంఘం రాష్ట్ర నాయకులు హాజరవుతారన్నారు. కార్యక్రమంలో తండా సర్పంచ్ శాంతమ్మ, బాబునాయక్, రాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.



ప్రతి ఒక్కరికీ కంటి పరీక్షలు



చెన్నూర్‌లో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

అమరచింత: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కంటివెలుగు కార్యక్రమం ద్వారా ప్రతి ఒక్కరికి కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి అద్దాలను ఇస్తున్నామని డీపీఓ సురేష్ కుమార్ అన్నారు. మండలంలోని చంద్రగఢ్‌లో నిర్వహిస్తున్న కంటి వైద్య శిబిరాన్ని మంగళవారం పరిశీలించారు. ఈ మేరకు వైద్యాధికారి డాక్టర్ దీపికతో కంటి పరీక్షల వివరాలను అడిగి తెలుసుకున్నారు. చంద్రగఢ్‌లో రెండో రోజు180 మంది కంటి పరీక్షలు నిర్వహించుకోగా.. 28మందికి కంటి ఆపరేషన్‌కు మరో 11 మందికి రీడింగ్ అద్దాలు పంపిణీ చేసినట్లు వైద్యాధికారి డాక్టర్ దీపిక తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ చాంద్‌పాషా, ఎంపీడీఓ జ్యోతి, ఎంపీఓ నరసింహులు, హెల్త్ సూపర్‌వైజర్లు సత్యమ్మ, సురేందర్‌గౌడ్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

గోపాలపేట: మండలంలోని చెన్నూరులో ఏర్పాటు చేసిన కంటివెలుగు శిబిరాన్ని ఎంపీపీ సంధ్య ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ శేషిరెడ్డి, ఎంపీటీసీ తిరుపతయ్య, మండల రైతుబంధు అధ్యక్షుడు తిరుపతియాదవ్, స్పెషల్ ఆఫీసర్ వెంకటరమణ, ఎంపీడీఓ ఉసేనప్ప, తదితరులు పాల్గొన్నారు.

470 మందికి..

పాన్‌గల్: మండల కేంద్రంతో పాటు బుసిరెడ్డిపల్లి, వెంగళాయిపల్లి గ్రామాల్లో నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమంలో మంగళవారం 470 మందికి పరీక్షలు నిర్వహించినట్లు పీహెచ్‌సీ డాక్టర్ హరినాథ్ రెడ్డి తెలిపారు. వీరిలో 34 మందికి కంటి అద్దాలు, 18 మందికి కంటి ఆపరేషన్ నిమిత్తం సిఫార్సు చేశామన్నారు. అంతకుముందు ఆయా కేంద్రాలను జిల్లా ఉద్యానవన శాఖ అధికారి, మండల ప్రత్యేక అధికారి సురేష్, ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి పరిశీలించారు.

ఏర్పాట్లు పరిశీలన

మండలంలోని కేతేపల్లిలో ఈనెల 9వ తేదీ నుంచి ప్రారంభించే కంటి వెలుగు కార్యక్రమం నిమిత్తం ఏర్పాటు చేసే కేంద్రాన్ని, వసతులను పీహెచ్‌సీ డాక్టర్ హరినాథ్‌రెడ్డి పరిశీలించి తగు సూచనలు చేశారు. అనంతరం సిబ్బంది కంటి వెలుగు కరపత్రాలను పంపిణీ చేసి గ్రామస్తులకు అవగాహన కల్పించారు.



చంద్రగఢ్‌లో వివరాలు తెలుసుకుంటున్న డీపీఓ సురేష్

262 మందికి..

ఖిల్లాఘనపురం: మండలంలోని రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మంగళవారం మొత్తం 262 మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్లు వైద్యాధికారులు డాక్టర్ ప్రవీణ్‌కుమార్, డాక్టర్ సౌజన్యలత తెలిపారు. ఖిల్లాఘనపురం పీహెచ్‌సీ పరిధిలోని సోళీపురంలో 111 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 10 మందికి అద్దాలు పంపిణీ చేయగా.. ఏడుగురికి ఆపరేషన్ అవసరమని గుర్తించారు. కమాలోద్దీన్‌పూర్ పీహెచ్‌సీ పరిధిలోని మామిడిమాడలో మొత్తం 151 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 20 మందికి కంటి అద్దాలు పంపిణీ చేయడంతో పాటు ఆరుగురికి ఆపరేషన్ అవసరమని గుర్తించినట్లు వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ రాంచందర్‌రెడ్డి, మక్బూల్ పాష తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ఆత్మకూర్: ఇండియన్ నెషనల్ ట్రస్టు ఫర్ ఆర్ట్, ఇన్‌టెక్ కల్చరర్ హెరిటేజ్, గ్రామీణ భాగస్వామ్య సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక బాలికల పాఠశాలలో విద్యార్థులకు ఖాన ఖజాన అంశంపై మండలస్థాయి వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈసందర్భంగా చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కమిషనర్ రమేష్, వీబీపీ సంస్థ జిల్లా సమన్వయకర్త నాగేంద్రస్వామి, హెచ్‌ఎం లక్ష్మీదేవి, కౌన్సిలర్ తబస్సుంమోసిన్ విద్యార్థులకు చిరుధాన్యాలలో ఉండే పోషక విలువలు, మట్టి పాత్రల్లో వండి తినడం వల్ల కలిగే లాభాలు, అల్యూమినియం పాత్ర లవల్ల కలిగే అనర్థాల గురించి క్లుప్తంగా వివరించారు. ఈసందర్భంగా మండలంలోని ప్రభుత్వ పాఠశాల నుంచి 55 మంది విద్యార్థులు వ్యాసరచన పోటీల్లో పాల్గొన్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు పురస్కారాలతో పాటు షీల్డులను బహూకరించనున్నట్లు సంస్థ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం విష్ణువర్ధన్‌రెడ్డి, నిర్వాహకులు రాంచందర్జీ, వెంకట్రామ్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న చైర్‌పర్సన్ గాయత్రి

అల్పాహారం అందజేత

కొత్తకోట రూరల్ (పెద్దమందడి): మండలంలోని మనిగిల్ల జెడ్పీహెచ్‌ఎస్‌లో చదువుతున్న విద్యార్థులందరూ 'అక్షర దీక్ష'ను చేపట్టారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయ బృందం 8గంటలకే తరగతులు నిర్వహిస్తున్నారు. దీంతో 'రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ' (ఆర్డీఎస్) అనే స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు విద్యార్థులందరికీ 41రోజుల పాటు ఉచితంగా అల్పాహారం అంజేసేందుకు ముందుకొచ్చారు. మంగళవారం ఉదయం పాఠశాలకు వచ్చిన 145మంది విద్యార్థులకు అల్పాహారం కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను గుర్తించి అల్పాహారం పెట్టేందుకు ముందుకు వచ్చిన స్వచ్ఛంద సంస్థల సభ్యులకు ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శంకర్‌గౌడ్, సంస్థ నిర్వాహకులు చిన్నమ్మ తామస్, ఉపాధ్యాయ బృందం వెంకటేశ్వర్లుగౌడ్, నాగేశ్వరమ్మ, విష్ణువర్ధన్, విజయ్‌కుమార్, చంద్రకళ, సురేఖ, శ్రీరాములు, సంస్థ సభ్యులు శ్రీలక్ష్మీ, జ్యోతి, కృష్ణనాయక్ తదితరులు ఉన్నారు.



విద్యార్థులతో కలిసి అల్పాహారం చేస్తున్న ఉపాధ్యాయులు

ఆయిల్‌పాం సాగుపై అవగాహన

చిన్నంబావి: మండలంలోని కొప్పునూరు రైతువేదికలో మంగళవారం వ్యవసాయ, ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో రైతులకు ఆయిల్‌పాం పంట సాగుపై అవగాహన కల్పించారు. పంట సాగు చేయడానికి అనువైన నేలలు, వాతావరణం, ఉష్ణోగ్రత, నీటి సదుపాయం, మొక్కలు–రకాలు, చీడపీడలు, వాటి నివారణ పద్ధతులు, ఎరువుల యాజమాన్యం, ఆయిల్ ప్రాసెసింగ్, సబ్సిడీ వివరాలను రైతులకు హార్టీకల్చర్ అధికారి కృష్ణయ్య, ఏఈఓ యుగంధర్ వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ నంది కౌసల్య, ఉపసర్పంచ్ ఆనంద్, రైతుబంధు సమితి అధ్యక్షుడు హుస్సేన్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పుల్లారెడ్డి, కురుమూర్తి, చిన్నస్వాములు, కంది పెద్ద మద్దిలేటి, రాజు, ప్రియూనిక్ కంపెనీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త

ఖిల్లాఘనపురం: ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న సైబర్ నేరాలపై ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ వెంకటేష్‌గౌడ్ అన్నారు. మంగళవారం మండలంలోని తెలంగాణ మోడల్ పాఠశాలలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు చదువు యొక్క ప్రాముఖ్యత, త్వరలో వచ్చే పరీక్షలకు ఎలా సిద్ధం కావాలి, సైబర్ నేరాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర వాటిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతు సమాజంలో చదువు వల్లనే గౌరవం, విలువ పెరుగుతుందన్నారు. విద్యార్థులు ఈ వయసులో చెడు దారుల్లో నడవకుండా మంచి నడవడిక, చదువు అలవర్చుకోవాలని సూచించారు. పదో తరగతి విద్యార్థులు పరీక్షల పట్ల ఆందోళన చెందకూడదన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేక అధికారి వాణికుమారి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్మికుల హక్కులు కాపాడాలి

అమరచింత: మిషన్ భగీరథ తాగునీటిని సరఫరా చేసే కార్మికుల వేతనాల పెంపు, కార్మికుల హక్కుల సాధన కోసం మంగళవారం ఇందిరాపార్కు వద్ద నిర్వహిస్తున్న మహాధర్నాకు కార్మికులు హైదరాబాద్‌కు తరలివెళ్లారు. మిషన్ భగీరథ కార్మిక సంఘం జేఏసీ జిల్లా నాయకుడు రఘు, సత్యారెడ్డి ఆధ్వర్యంలో రామన్‌పాడ్ వద్ద ఉన్న ఎర్రగట్టు మిషన్ భగీరథ కార్మికులతో కలిసి ధర్నాలో పాల్గొనడానికి బయలుదేరినట్లు తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. కాంట్రాక్ట్ కార్మికులకు రెగ్యూలరైజ్ చేయాలన్నారు. ఉద్యోగ భద్రతతో పాటు 20 శాతం బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. జీఓ నంబర్ 60 లేదా జీఓ నంబర్ 11ను తక్షణమే అమలు పర్చాలని కోరారు. కంపెనీలు కాకుండా మిషన్ భగీరథ ద్వారానే జీత భత్యాలు చెల్లించాలనే డిమాండ్‌తో జెఏసీ ఆధ్వర్యంలో నిర్వహించే మహ ధర్నా కు కార్మికులు అధిక సంఖ్యలో తరలి వస్తున్నరని వెల్లడించారు.



హైదారాబాద్‌కు వెళ్తున్న 'భగీరథ' కార్మికులు

9న చలో హైదరాబాద్

అమరచింత: నిరుపేదలకు ఇంటి స్థలాలతో పాటు సొంత స్థలం ఉన్న వారికి ఇంటి నిర్మాణం కోసం రూ.5లక్షలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 9న చలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని సీపీఎం జిల్లా నాయకులు అజయ్, వెంకటేష్, ఆర్‌ఎస్ రమేష్ తెలిపారు. పట్టణంలోని దుంపాయికుంటలో నిర్వహిస్తున్న గుడిసెల పోరు కార్యక్రమం మంగళవారం నాటికి 150 రోజులకు చేరుకోవడంతో లబ్ధిదారులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించిందని దుయ్యబట్టారు. కార్యక్రమంలో నాయకులు బుచ్చన్న, అనంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

వరిలో తెగుళ్ల నివారణకు చర్యలు

- జిల్లా వ్యవసాయ అధికారి సుధాకర్‌రెడ్డి, మదనాపురం కేవీకే శాస్త్రవేత్త రాజేందర్ రెడ్డి, ఏడీఏ సత్యంబాబు
- క్షేత్రస్థాయిలో పర్యటించిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..



అప్పారెడ్డిపల్లి శివారులో వట్టిపోయిన పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు

ఖిల్లాఘనపురం: యాసంగిలో సాగు చేసిన వరిలో వచ్చే తెగుళ్ల నివారణకు వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తూ పురుగు మందులు, ఎరువులు వాడాలని జిల్లా వ్యవసాయ అధికారి సుధాకర్‌రెడ్డి, మదనాపురం కేవీకే శాస్త్రవేత్త రాజేందర్‌రెడ్డి, ఏడీఎ సత్యంబాబు రైతులకు సూచించారు. ఈ నెల 6న 'వరికి తెగుళ్ల బెడద' అనే శీర్షికన సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి స్పందించిన వ్యవసాయ అధికారులు మంగళవారం మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అప్పారెడ్డిపల్లి, మానాజీపేట గ్రామాల్లో పర్యటించారు. ఈ కార్యక్రమానికి హాజరైన శాస్త్రజ్ఞులు వరి, మొక్కజొన్న ఆకులు, వేర్లు తదితర వాటిని క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఏడాది యాసంగిలో వరి పంటలకు చీడపీడల ప్రభావం ఎక్కువగా ఉందని, వ్యవసాయ అధికారుల సూచనలు పాటించి తెగుళ్లను నివారించాలన్నారు. జింకులోపం, చౌడు నేలలు, సల్ఫర్, కాండం తొలుచు పురుగు ప్రభావం వలన పంటల్లో ఎదుగుదల తగ్గిందన్నారు. వ్యవసాయ అధికారుల సూచనల ప్రకారం మొక్కజొన్న పంట సుడిలో గుళికలు, మందులు తగిన మోతాదులో వేయాలన్నారు. యాసంగిలో వరి పంటకు ఎక్కువగా జింకు లోపం ఏర్పడుతుందన్నారు. చలి తీవ్రత ఎక్కువగా ఉన్న సమయంలో మొక్కలు పోషకాలను తీసుకోకపోవడం వలన ఈ సమస్య వస్తుందని, పంట పూర్తిగా గిడుసు బారిపోతుందని శాస్త్రజ్ఞులు తెలిపారు. నివారణకు జింక్‌సల్ఫేట్ 250 గ్రాములు ఎకరానికి 5 రోజుల వ్యవధిలో రెండు దఫాలుగా వరి పంటకుపై పిచుకారీ చేసుకోవాలన్నారు.

చౌడు నేలల్లో..

చౌడు నేలల్లో వరి పంటను చీడపీడలు ఆశిస్తాయని, నెల రోజుల వరకు చౌడు ప్రభావంతో మొక్కలు ఆక్సీజన్ తీసుకోకపోవడంతో మొక్కల ఎదుగుదల నిలిచిపోతుందన్నారు. నివారణ కోసం ఎలాంటి మందులు వాడాల్సిన అవసరం ఉండదన్నారు. నిండుగా నీళ్లు పెట్టి మనుషుల చేత కలుపు తీయించి నీటిని పూర్తిగా తీసివేయాలని శాస్త్రవేత్తలు సూచించారు. అదేవిధంగా సల్ఫర్ ప్రభావం ఉన్న పంట వేర్లు నల్లగా మారి కుదురు మొత్తం కోడి గుడ్డు వాసన వస్తుందన్నారు. నివారణకు వెంట్రుక మందం నెర్రెలు వచ్చే వరకు ఆరబెట్టి తరువాత ఎకరాకు 25 కిలోల యూరియా, కార్బండిజం మాంకొ జెబ్ 500 గ్రాముాలు పంటపై కలిపి వెదజల్లాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మల్లయ్య, అప్పారెడ్డిపల్లి సర్పంచ్ కృష్ణవేణి, ఏఈఓలు బాల్‌రాజు, శంకరమ్మ, మహేష్ ఆయాగ్రామాల రైతులు పాల్గొన్నారు.

రైతులపై వివక్ష ఇంకెన్నాళ్లు?



మాట్లాడుతున్న నాగరాజుగౌడ్

ఆత్మకూర్: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేపట్టిన హాత్‌సే హాత్‌జోడో యాత్రలో భాగంగా కాంగ్రెస్‌కే సాథ్ హాత్‌జోడో అంటూ కాంగ్రెస్ పార్టీ నారాయణపేట జిల్లా అధ్యక్షుడు వాకిటి శ్రీహరి, రాష్ట్ర అధికార ప్రతినిధి నాగరాజుగౌడ్, టీపీసీసీ సభ్యులు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, పోలీస్ చంద్రశేఖర్‌రెడ్డి, కత్తెపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని ఖానాపూర్‌లో ఇంటింటికీ వెళ్లి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఊరించి ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రైతులకు అన్యాయం జరిగిందని, రూ.30వేలు ధర పలికిన మిర్చి ప్రస్తుతం రూ.15వేలకు, రూ.10వేలు ఉన్న పత్తి ధర రూ.7వేలకు పడిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు పండించిన పంటకు మద్దతు ధర కల్పిస్తేనే న్యాయం జరుగుతుందని, రుణమాఫీ అంటూ ప్రతిఏడాది బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తూనే ఉన్నారని, నేటికీ రైతుల రుణాలు మాఫీ కాలేదని దుయ్యబట్టారు. కేంద్ర ప్రభుత్వం దేశ సంపదను, ఆస్తులను అదానీ చేతుల్లో పెట్టి దేశ ప్రజలపైన రూ.170 లక్షల కోట్లు అప్పును పెట్టారని ధ్వజమెత్తారు.

రూ.2లక్షల రుణమాఫీ

రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమని, అధికారంలోకి వచ్చినవెంటనే రైతులకు ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని నాగరాజుగౌడ్ ప్రకటించారు. రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు ముందుకెళ్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో అయూబ్‌ఖాన్, శ్రీనివాస్‌రెడ్డి, గంగాధర్‌గౌడ్, రహ్మతుల్లా, పరమేష్, నల్గొండ శ్రీను, రవీందర్, విష్ణురెడ్డి, బాబు, హుస్సేన్‌మియా, మహేందర్‌రెడ్డి, అరుణ్‌కుమార్, బుచ్చన్న, విష్ణు తదితరులు ఉన్నారు.

కేంద్ర పథకాలపై విస్తృత ప్రచారం

అమరచింత: కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలకు అందిస్తున్న నిధులు, పథకాల గురించి ప్రతి కుటుంబానికి తెలియపర్చేందుకు బీజేపీ కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని కేంద్ర ప్రభుత్వ పథకాలపై విస్తృతంగా ప్రజలకు అవగాహన కల్పించాలని బీజేపీ జిల్లా కోశాధికారి మరాఠి అశోక్ అన్నారు. మండలంలోని కిష్టంపల్లిలో మంగళవారం బీజేపీ మండల, పట్టణ కమిటీల బూత్ లెవల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ హయాంలో ప్రతి ఇంటికి అందుతున్న కేంద్ర పథకాల గురించి వివరించాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర నిధులు వెచ్చించి తమ నిధుల ద్వారానే రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నామని ప్రకటించుకోవడం వింతగా ఉందన్నారు. రైతు ప్రయోజనాల కోసం గ్రామాల్లో రైతువేదికల నిర్మాణాలకు కేంద్ర నిధులు వినియోగించుకొని సీఎం కేసీఆర్ తన బొమ్మలను భవనాలకు వేయించుకోవడం ఎంత వరకు సమంజసం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు తెలియపరుస్తూ పార్టీ ఎదుగుదలకు నిరంతరం శ్రమించాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ మండల, పట్టణ అధ్యక్షులు హరీష్, క్యామ భాస్కర్, నాయకులు దుబాయ్ వెంకటేశ్వర్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి, మల్లారెడ్డి, భీంరెడ్డి, చుక్క సుధ, పశువుల వినోద్, కురుమారెడ్డి, రవీందర్, తులసీరామ్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

గిరిజనులను భయపెట్టేందుకే ఎక్సైజ్ దాడులు

అమరచింత: మండలంలోని చంద్రనాయక్‌తండాతో పాటు పలు తండాల్లో ఉద్దేశపూర్వకంగానే ఎక్సైజ్ అధికారులు దాడులు చేసి అక్కడి గిరిజనులను వేధిస్తున్నారని టీపీసీసీ అధికార ప్రతినిధి నాగరాజుగౌడ్, ప్రశాంత్‌రెడ్డి, డీసీసీ నారాయణ పేట అధ్యక్షుడు వాకిటి శ్రీహరి అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన హాత్ కే సాత్ హాత్ జోడో యాత్రలో గిరిజనులు కాంగ్రెస్‌కు మద్దతు పలికారని తెలిపారు. దీన్ని జీర్ణించుకోలేని అధికార పార్టీ నాయకులు మంగళవారం సారా తయారు చేసి విక్రయిస్తున్నారనే ఆరోపణలు చేస్తూ ఎక్సైజ్ అధికారులతో దాడులు చేయించడం సరైన పద్ధతి కాదని దుయ్యబట్టారు. మండలంలోని చంద్రనాయక్‌తండా, తుక్యానాయక్ తండా, దీప్లానాయక్ తండా, కొత్తతండాల్లో నివసిస్తున్న గిరిజనులు పాదయాత్రలో పాల్గొన్నారన్నారు. అక్రమంగా అరెస్టు చేసిన వారిని వెంటనే వదిలి వేయాలని ఎక్సైజ్ సీఐ కార్యాయలం వద్ద కాంగ్రెస్ నాయకులు ఆందోళన చేశారు. కార్యక్రమంలో చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈవ్యవహారంపై ఎక్సైజ్ సీఐ బాలరాజ్‌ను వివరణ కోరగా.. విధి నిర్వహణలో భాగంగా తండాల్లో సారా తయారీ కేంద్రాలను గుర్తించి దాడులు చేస్తున్నామని ఇందులో రాజకీయం లేదని వివరించారు.

మధ్యాహ్న భోజనం నాణ్యతగా అందించాలి

పాన్‌గల్: విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం నాణ్యతగా అందించాలని మండల ప్రత్యేకాధికారి సురేష్ అన్నారు. మంగళవారం మండలంలోని గోప్లాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించి భోజనాన్ని, విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్లు, విద్యార్థుల సామర్థ్యాలను ఆయన పరిశీలించారు. పాఠశాల హెచ్‌ఎంలు ప్రతినిత్యం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి మెనూ ప్రకారం అందుతుందా లేదా అనే విషయాలను పరిశీలించాలన్నారు. అనంతరం మండలంలోని కేతేపల్లి, బుసిరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలను సందర్శించి మన ఊరు–మన బడి అభివృద్ధి పనులను పరిశీలించి అసంపూర్తి పనులను త్వరగా పూర్తి చేసి త్వరగా వినియోగంలోకి తీసుకురావాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి, ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్, పీఆర్ ఏఈ సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న అధికారులు

దళితులపై దాడి చేయడం సరికాదు: ఎమ్మార్పీఎస్

చిన్నంబావి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న వరుణ్‌కుమార్‌ను సస్పెండ్ చేసి అతడిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని బీఎస్పీ, ఎమ్మార్పీఎస్ నాయకులు బొల్లి కుర్మయ్య, దేవని రమేశ్ డిమాండ్ చేశారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ కొప్పునూరుకు చెందిన తగరం కుర్మయ్య అనే వ్యక్తి ప్రతిరోజు ప్రజల సమస్యలపై తహసీల్దార్ కార్యాలయానికి వెళ్తుంటారు. అదే విధంగా సోమవారం సాయంత్రం 4 గంటల సమయంలో తహసీల్దార్ కార్యాలయంలో ఆర్‌ఐ రాములు, జూనియర్ అసిస్టెంట్ వరుణ్‌కుమార్ ఇద్దరూ కార్యాలయంలో గొడవ పడుతున్న సందర్భంలో అక్కడే ఉన్న తగరం కుర్మయ్యను అకారణంగా జూనియర్ అసిస్టెంట్ దూషించారని ఆందోళన వ్యక్తం చేశారు. అంతటితో ఆగకుండా కుర్మయ్య సెల్‌ఫోన్ లాక్కొని పగలకొట్టాడు. ఈ విషయం తెలుసుకున్న బీఎస్పీ, ఎమ్మార్పీఎస్ నాయకులు మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో తహసీల్దార్ దగ్గరికి వెళ్లి మాట్లాడాలని ఆఫీస్‌కు వెళ్లారు. అక్కడే కార్యాలయంలో ఉన్న జూనియర్ అసిస్టెంట్‌ను సార్ మీరు ఎందుకు సెల్‌ఫోన్ పగలగొట్టారని అడుతుండగా మీరెవరు నన్ను అడిగేది, ఎవ్వరికి చెప్పుకుంటారో చెప్పుకోండని మమ్మల్ని దుర్భాషలాడుతూ బీఎస్పీ నాయకుడు బండారు వెంకటేష్‌పై దాడి చేసి గాయపరిచాడని తెలిపారు. అంతటితో ఆగకుండా వెంటనే తన చాంబర్‌లో ఉన్న తహసీల్దార్‌పై కూడా దాడి చేయడానికి వెళ్లాడని, ప్రజాస్వామ్యంలో దళితులు ఆఫీస్‌కు రావొద్దా, భారత రాజ్యాంగం అందరికి సమాన హక్కులు కల్పించింది. రావొద్దని చెప్పడానికి అతడికి ఏం అర్హత ఉందో చెప్పాలని ప్రశ్నించారు. సమావేశంలో బీఎస్పీ మండల అధ్యక్షుడు దేవని రాజు, ఎమ్మార్పీఎస్ నాయకులు వడ్డెమాన్ బిచ్చన్న, బీఎస్పీ ఉపాధ్యక్షుడు బాలు, విధాత, ఎమ్మార్పీఎస్ రవివర్మ, డీఎస్ కృష్ణ, నారాయణ, బాలకృష్ణ, స్వామి, రవి, కుర్మన్న, బక్కి రమేశ్, మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

ఓటు హక్కు సద్వినియోగం చేసుకోవాలి

ఆత్మకూర్: ఓటు హక్కు మన జన్మ హక్కుగా భావించాలని, 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకుని ఓటుహక్కును సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించాలని తహసీల్దార్ సింధూజ అన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఓటర్‌కార్డుకు ఆధార్‌కార్డు అనుసంధానం అనే అంశంపై ప్రజాప్రతినిధులకు, బీఎల్‌ఓలకు అవగాహన కల్పించారు. ఆధార్ అనుసంధానం చేసుకునేందుకు ఓటర్లకు ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కమిషనర్ రమేష్, కౌన్సిలర్లు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.



రమాబాయికి ఘన నివాళి



వనపర్తి టౌన్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ అర్ధాంగి రమాబాయి కష్టకాలంలో అంబేడ్కర్‌కు అండగా నిలిచి ఆయన ఆశయసాధనకు కృషి చేసిన రమాబాయి స్ఫూర్తి మరువలేనిదని ప్రజా వాగ్గేయకారుడు రాజారామ్‌ప్రకాశ్ అన్నారు. మంగళవారం రమాబాయి జయంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఆమె చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కవి గిరిరాజాచారి, కవి డాక్టర్ నాయకంటి నరసింహశర్మ, కవి ఈశ్వర్, కృష్ణ, చిన్నరాములు, కురుమూర్తి, వెంకటేష్, పరమేశ్వరచారి, సత్యం చారి, రమేష్ చారి, దేవన్న నాయుడు, కొమ్ము బాలస్వామి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.